



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

పేదల 'ఉపాధి'కి ఎసరు..

ఉపాధి హామీ చట్టం పేరు మార్చేసిన కేంద్రం

రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇవ్వాలని షరతు

19న వ్యకాస ఆధ్వర్యంలో ఆందోళన

పేదల ఉపాధికి కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఎసరు పెట్టేందుకు కుట్ర పన్నుతోంది. ఉపాధి హామీ చట్టంలో పూర్తిగా మార్పులు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ వాటాను 40 శాతానికి పెంచింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వాటాగా ఉన్న 10 శాతం నిధులు బకాయిలు పడుతూనే ఉన్నాయి. దాన్ని పెంచడంతో బకాయిలు మరింత పెరిగి పేదలకు ఉపాధి దూరం అయ్యే అవకాశం ఏర్పడనుంది. దీన్ని వ్యతిరేకిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నారు...



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కరువు ప్రాంతం అయిన కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పథకం నిరుపేదలకు భరోసా కల్పించే విధంగా ఉపాధి హామీ పథకం దూరం చేసే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడుగులు వేసింది. ఏకంగా మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవక మిషన్ - గ్రామీణ్‌గా పేరు మార్చేసింది. అలాగే గతంలో ఉన్న చట్టంలో అనేక మార్పులు చేస్తూ తీసుకున్న చర్యలు కూడా చట్టాన్ని నిర్వీర్యం వేసేందుకు చర్యలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పట్ల ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమాలను చేపట్టేందుకు సన్నద్ధమైంది. ప్రస్తుతం ఉన్నటువంటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్పు చేస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టింది. ఇప్పుడు ఈ చట్టాన్ని స్కీముగా మార్చేందుకు అడుగులు వేసింది. కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులతో అమలు చేస్తుంది. ఇక నుండి కేంద్రం వాటా 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాట 40 శాతంగా ఖర్చు చేయాలని చట్టంలో మార్పు చేసింది. కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 3.32 లక్షల లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రతి ఏడాది జిల్లాలో ఉపాధి కూలీల కుటుంబానికి సగటు రూ.13,190 మాత్రమే లభిస్తుంది. ఒక్కో కార్మికుడికి 40-50 రోజులు పని లభిస్తుంది. కర్నూలు జిల్లాలో సంఘటన ఉపాధి హామీ పథకం కింద దాదాపుగా రూ.350 కోట్ల పైగా ఖర్చు చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా అనుగుణంగా చూస్తే నిధులు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉంది. కేంద్ర ప్రభుత్వం వాటా కింద విడుదల చేసే నిధులను అడపాదడపా విడుదలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం వాటా నిధులు విడుదల కావడం లేదు. ఇప్పుడు 40 శాతం నిధులు విడుదల చేయాలంటే కష్టతరంగానే మారుతుంది. ఇప్పటికే ఉపాధి కూలీలకు చేసిన పనులకు కూలి డబ్బులు చాలా ఆలస్యంగానే విడుదలవుతున్నాయి. రాబోయే రోజుల్లో ఉపాధి కూలీలు చేసిన పనికి సంబంధించిన కూలి డబ్బుల కోసం వేచి చూడాల్సి ఉంది. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో నిరుపేదలు ఉపాధి పనులకు వెళ్లి కొంత లబ్ది పొందుతున్నారు. ఇప్పుడు అది కూడా లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమైంది.

ఉపాధి హామీ సిబ్బందికి భరోసా కరువు



ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం వాటాగా కేటాయించిన నిధులను కూడా తగ్గించుకోవడం బాధాకరం. ఇప్పటికే ఉపాధి హామీ ఉద్యోగులకు సక్రమంగా వేతనాలు అందడం లేదు. రాబోయే కాలంలో వేతనాలు కూడా వస్తాయో లేదో కూడా దిక్కుతోచని పరిస్థితి ఉంది. ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేయాలి.

- లక్ష్మన్న, ఉపాధి హామీ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్.

పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర



కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకే కుట్ర చేస్తోంది. అందులో భాగంగానే మహాత్మా గాంధీ పేరును తొలగించి రాంజీ పేరుతో పేరు మార్చేందుకు సన్నద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం వాటాకు సంబంధించిన నిధులను కూడా తగ్గించుకోవడం రాష్ట్ర ప్రభుత్వాల వాటా పెంచడం దుర్మార్గం. కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఈనెల 19న జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నాం.

- కెవి నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

బాధితులకు త్వరితగతిన పరిహారం

- ఎస్సి, ఎస్టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జెసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద బాధిత కుటుంబాలకు పరిహారం త్వరిత గతిన మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుకు సంబంధించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధిత కుటుంబాలకు ఉపాధి, ఇంటి స్థలం, అర్హత కలిగిన ఇతర ప్రయోజనాలను త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా ఖచ్చితంగా సివిల్ రైట్ డే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కర్నూలు, పత్తికొండ, ఆదోని ఆర్డీఒలకు సూచించారు. డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో పెండింగ్‌లో ఉన్న 152 మంది బాధితులకు ఎఫ్ఐఆర్, ఛార్జ్ షీట్‌లో రావాల్సిన మానిటరి రిలీఫ్‌కు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఒ భరత్ నాయక్, డివిఎంసి సభ్యులు సురేంద్ర, సురేష్, వెంకట నాగరాజు యాదవ్, మాలతి, మధు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

21న పల్స్ పోలియో కార్యక్రమం : జెసి

ఈనెల 21వ తేదీన జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సంబంధిత అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 3 లక్షల 52 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,600 పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 1,180 బూత్‌లు, పట్టణ ప్రాంతాల్లో 420 బూత్‌లు, 52 ట్రాన్సిట్ పాయింట్లు, 63 మొబైల్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయడానికి 5 లక్షల 14 వేల ఇళ్లను లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.భాస్కర్, డిఐఓ డాక్టర్ ఉమ పాల్గొన్నారు.

పన్ను ఎగవేతదారులకు రెడ్ నోటీసులు

- అప్పటికీ చెల్లించకపోతే మున్సిపల్ సేవలు కట్
- టాప్-20 మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టి : కమిషనర్ పి.విశ్వనాథ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో పన్ను ఎగవేతదారులకు, దీర్ఘకాలిక పెండింగ్‌తో ఉన్న పన్నుదారులకు రెడ్ నోటీసులు జారీ చేసి వసూళ్లను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయం నుండి ఆర్వోలు, ఆర్ఐలు, నోడల్ అధికారులు, అడ్మిన్‌లతో ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. టాప్-20 మొండి బకాయిదారులపై తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా మొండి బకాయిలను సమన్వయంతో రాబట్టాలని, ప్రగతి పన్నుల ఆవశ్యకతను ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. ప్రతి పన్ను ఎగవేత దారుడికి, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పన్నుదారులకు ముందుగా రెడ్ నోటీసులు ఇవ్వాలని, అయినప్పటికీ స్పందించకపోతే మున్సిపల్ సేవలను నిలిపి వేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను మాత్రమే కాక నీటి కొళాయి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ బకాయిలు వంటి అన్ని వసూళ్లపై నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి వార్డులో రోజువారీ వసూళ్ల పురోగతిని మానిటర్ చేయాలని, లక్ష్యాలు నెరవేర్చడంలో ఎటువంటి నిర్లక్ష్యానికీ తావులేదని హెచ్చరించారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఆర్వోలు జునైద్, స్వర్ణలత, వాజీద్, ఆర్ఐలు, నోడల్ అధికారులు, అడ్మిన్లు పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి కావాలి : నగరంలోని 52 వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఇంజనీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. నగరంలో చేపడుతున్న రూ.25 కోట్ల అభివృద్ధి పనుల పురోగతిని వార్డుల వారీగా కమిషనర్ సమీక్షించారు. రూ.23 కోట్లు సాధారణ నిధులు, రూ.1.50 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు, రూ.60 లక్షలు ఎన్‌క్యాప్ నిధులతో జరుగుతున్న పనులపై కమిషనర్ పురోగతి వివరాలు తెలుసుకున్నారు. పనుల నాణ్యత, వేగం, పర్యవేక్షణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అవసరమైన చోట గుత్తేదారులపై ఒత్తిడి పెంచి, జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కలెక్టర్ల సదస్సులో మంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్/క్రైం

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అమరావతిలో నిర్వహించిన 5వ జిల్లా కలెక్టర్ల సదస్సులో కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులు ఆయా శాఖలకు సంబంధించిన కార్యక్రమాలను వివరించారు. ఇందులో భాగంగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ ఎ.సిరి తన నివేదికలో వెల్లడించారు. అలాగే పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కూడా సదస్సులో పాల్గొన్నారు. సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి, సంక్షేమం అజెండాగా రెండు రోజులపాటు ఈ సదస్సు జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.



సదస్సులో పాల్గొన్న మంత్రి టిజి భరత్



అమరావతిలో జరిగిన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

విశాఖపట్నంలో ఈనెల 31వ తేదీ నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు జరుగు సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కోరారు. బుధవారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు కర్నూలు మండల కమిటీ సమావేశం ఉపాధ్యక్షుడు చెన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎప్పుడూ లేనంత పరిస్థితిని కార్మికులు ఎదుర్కొంటున్నారని, అటువంటి సమయంలో రాష్ట్రంలో సిఐటియు అఖిలభారత మహాసభలు జరగడం అందరికీ గర్వకారణ మన్నారు. అఖిల భారత మహాసభల విజయవంతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. 130 సంవత్సరాల క్రితం సాధించుకున్న హక్కులు కూడా నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం హరించి వేస్తుందని విమర్శించారు. మహాసభల్లో దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపైన చర్చించ నున్నట్లు తెలిపారు. అలాగే అనేక రంగాలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపైన చర్చించి తీర్మానాలు చేసి, అమలుకు భవిష్యత్తులో ఐక్యంగా పోరాడాల్సి అవసరం ఉంటుందన్నారు. 2026 జనవరి 4వ తేదీ విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభకు కర్నూలు జిల్లా నుండి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి యం.గోపాల్, యూనియన్ నాయకులు మస్తాన్, లవన్న, మధు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండి అంజిబాబు

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీ డిగ్రీ 3, 5వ సెమిస్టర్ ఫలితాలను ఇంచార్జి వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్, ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ నాగరాజ్ శెట్టి బుధవారం విడుదల చేశారు. మూడవ సెమిస్టర్‌లో 866 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 617 మంది పాసయ్యారు. 71.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. 5వ సెమిస్టర్‌లో 804 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 709 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 5వ సెమిస్టర్‌లో 88.18 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.



క్లస్టర్ వర్సిటీ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేస్తున్న వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు



ఉద్యోగ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు

ప్రజాశక్తి - వెల్దుర్తి

యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు తెలిపారు. బుధవారం వెల్దుర్తిలోని శ్రీగిరి గోవర్ధన ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాలతో పాటు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం ఈ ఉద్యోగ మేళా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 281 మంది నిరుద్యోగ యువత హాజరు కాగా 13 కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 81 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి వేతనం ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. అనంతరం అంగన్వాడీ వర్కర్లకు ఎమ్మెల్యే శ్యాంబాబు చేతుల మీదుగా 5జి సెల్‌ఫోన్లను పంపిణీ చేశారు. అలాగే గిరి గోవర్ధన ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ ఎంపిపి జ్ఞానేశ్వర్ గౌడ్ నిరుద్యోగులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేకాధికారి సురేష్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి బాలకృష్ణ, తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపిడిఒ సుహాసినమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ రవికిషోర్, సిడిపిఒ లుక్కు పాల్గొన్నారు.

అల్లూరికి అండగా నిలిచిన

'ఫజిలుల్లా ఖాన్, షేక్ మదీనా' పుస్తక ఆవిష్కరణ

ప్రజాశక్తి - కోడుమూరు

అల్లూరి సీతారామరాజుకు అండగా నిలిచిన ముస్లిం యోధులు ఫజులుల్లా ఖాన్, షేక్ మదీనా చరిత్రను బయటకు తీసేందుకు కృషి చేసిన ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నాసిర్ అహ్మద్ రచించిన పుస్తకావిష్కరణను బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు ముస్తఫా అధ్యక్షత వహించా రు. ముఖ్య అతిథులుగా ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షులు ఇంతి యాజ్ బాష, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మునుస్వామి, వైసిపి లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ ప్రభాకర్, సిపిఎం నాయకులు గఫూర్‌మియా, మండల ఖాజీ హాజీ బాష, టిడిపి నాయకులు దావూద్, జంజం మసీదు ముతవల్లి గద్వాల రఫీక్, చర్చి ప్రధాన పాస్టర్ సామ్యూల్, సిఐటియు మండల అధ్యక్షులు జిపి.వీరన్న, ఆవాజ్ మండల నాయకులు ఆర్.ఖాజా, నాయకులు దొడ్డి చాంద్ బాష హాజరయ్యారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



ఉద్యాన పంటలో కొత్త రకాలపై శిక్షణ

ప్రజాశక్తి -కోడుమూరు

మండలంలోని లద్దగిరి గ్రామంలో ఉద్యాన పంటల్లో కొత్త రకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లద్దగిరి గ్రామంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు మామిడి, ఇతర ఉద్యాన పంటలలో కొత్త రకాలపై శిక్షణ నిర్వహించారు. మహానంది ఉద్యాన పరిశోధన కేంద్రానికి చెందిన ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఠాగూర్ నాయక్ ప్రస్తుతం మామిడి తోటలో పాటించాల్సి సమగ్ర యాజమాన్య పద్ధతులు వివరించారు. ముఖ్యఅతిథిగా ఆదర్శ రైతు రామాంజనేయులు మామిడి రకాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. లద్దగిరి గ్రామంలో సూర్య ప్రకాష్ రెడ్డి పొలంలో మామిడిలో 48 నూతన రకాలు, పనస, నేరేడు, సీతాఫలం, మల్బరీ తదితర ఉద్యాన పంటల రకాలు సాగు చేస్తున్నారు. జెడిఎ వరలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి రాజాకృష్ణారెడ్డి, ఎపిఎంఐపి పతాక సంచాలకులు శ్రీనివాసులు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, కర్నూలు డివిజన్ ఎడిఎ సాలురెడ్డి, కోడుమూరు ఎఒ రవి ప్రకాష్, ఉద్యాన అధికారి మదన్మోహన్ పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నన్నూరు బైరెడ్డి కాలనీ ఎస్సీ ఏరియాలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్ విద్యుత్ ఎఇని నాగన్న, మండల నాయకులు ఎస్.మధుసూదన్, ఆర్.మహేష్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ స్తంభం తగ్గులో ఉండడంతో కాలనీవాసులు అనేక సంవత్సరాలుగా భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. తగ్గులో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎఇ స్పందిస్తూ... కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి



ఎన్ఎస్ఎస్ క్యాంపు శిబిరాన్ని పరిశీలిస్తున్న వీసీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జాతీయ సేవాపథకం స్ఫూర్తితో వాలంటీర్లు సమాజసేవలో భాగస్వాములు కావాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ ఆచార్య వి.వెంకట బసవరావు తెలిపారు. యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీకి సంబంధించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రుద్రవరం, నూతనపల్లె గ్రామాల్లో నిర్వహించిన క్యాంపు శిబిరాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ఇలాంటి వాటిలో భాగస్వామ్యం కావాలని, సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని కోరారు. రిజిస్ట్రార్ డి.విజయ్ కుమార్ నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నాగ చంద్రుడు, బివి.శివప్రసాదరెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్, రుద్రవరం సర్పంచి మధు, పంచాయతీ కార్యదర్శి హేమంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్ - వాష్ అండ్ గో'


ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రోడ్డు ప్రమాదాల నివారణకు కర్నూలు పోలీసులు భారీ వాహనాలకు 'స్టాప్ - వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాత్రి, తెల్లవారుజామున తిరిగే వాహనాల్లో సరైన భద్రత చర్యలు, జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహిచారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సుల వంటి భద్రతా ప్రమాణాలను పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి గణిత వీడియో పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ గణిత వేదిక మరియు అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్, విజయవాడ సంయుక్తంగా ఈ నెల 13, 14 తేదీల్లో విధానంలో రాష్ట్ర స్థాయి గణిత వీడియో పోటీల్లో కర్నూలు విద్యార్థులు ప్రతిభ చాటారు. కర్నూలు ఉర్దూ ప్రభుత్వ హైస్కూల్ (ఉర్దూ), కర్నూలుకు చెందిన విద్యార్థులు షేక్ అకీబా నిదా, షేక్ ఆయేషా రాష్ట్ర స్థాయిలో టాప్ 10 ర్యాంకులు సాధించారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పరాజ్ మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందించి, మార్గదర్శక ఉపాధ్యాయులు షేక్ షకీలా నిబద్ధతను ప్రశంసించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

ఘనంగా షర్మిల పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల రెడ్డి పుట్టినరోజు వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, జిలాని బాష కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ ఎన్‌సి.బజారన్న, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎ.సూర్య ప్రకాష్ రెడ్డి, ఓబీసీ సెల్ ఛైర్మన్ డివి.సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా ఛైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల జన్మదిన వేడుకలు

కర్నూలు హాస్పిటల్ : నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కంపోస్ట్ ఇన్ సొసైటీ అనాథ ఆశ్రమంలో ఎఐసిసి సభ్యులు, నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు, కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జీ జె.లక్ష్మి నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి అనాథ బాలికల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కొనియాడారు. నంద్యాల పార్లమెంట్ కెకెసి ఛైర్మన్ పఠాన్ అబిబ్ ఖాన్, అలాగే నంద్యాల పార్లమెంట్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు జాకిర్ హుస్సేన్, రహీమ్ పాల్గొన్నారు.



వేడుకలను నిర్వహిస్తున్న లక్ష్మీ నరసింహ యాదవ్

స్థానిక సమస్యలు పరిష్కరించాలి

- ఎంపిడిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండల సిపిఎం ఆధ్వర్యంలో గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని కల్లూరు ఎంపీడీవో జిఎన్ఎస్.రెడ్డికి సిపిఎం మండల కార్యదర్శి ఎ.కృష్ణ, మండల నాయకులు కె.మధు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎ కృష్ణ, కె మధు మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలు క్లీన్ చేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ ఉలిందకొండ, బొల్లవరం, కొంగనపాడు, చిన్నటేకూరు, బస్తిపాడు లాంటి గ్రామాల్లో సంవత్సరకాలం పూర్తయిన డ్రైనేజీలు క్లీన్ చేయడం లేదు అన్నారు కొన్ని గ్రామాల్లో మంచినీటి సమస్య ఉన్నదనీ రోడ్లు కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు యాపర్లపాడు, ఎర్రకత్వా లాంటి గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు అన్నారు. తక్షణమే ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎంపీడీవో స్పందించి స్థానిక సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారం కానీ ఎడల మండలంలోని ప్రజల్ని ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.



ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సంతోష్ ట్రోఫీకి నరసింహుడు ఎంపిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్




జాతీయస్థాయి సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు కర్నూలు జిల్లాకు చెందిన నరసింహుడు ఎంపికయ్యారు. రాష్ట్ర జట్టు తరపున ఈనెల 18 నుంచి 22 వరకు అనంతపురం ఆర్‌డిటి గ్రౌండ్స్‌లో జరిగే జాతీయ స్థాయి సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారని ఫుట్ బాల్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జరిగిన అభినందన సభలో జిల్లా ఫుట్‌బాల్ ప్రెసిడెంట్ ముప్పా రాజశేఖర్ మాట్లాడుతూ... జిల్లా క్రీడాకారుడు సంతోష్ ట్రోఫీకి ఎంపిక కావడం గర్వించ దగ్గ విషయమని తెలిపారు. జాతీయస్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సెక్రటరీ వై.శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ క్రీడాకారునితోపాటు కోచ్ బబ్లు, శ్రీనివాసులును అభినందించారు.

ఓర్వకల్లు ఎంఇఒగా రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు ఎంఇఒగా కె.రాంభూపాల్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన లొద్దిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. అదనంగా ఎంఇఒ-1గా బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఎంఇఒ రాంభూపాల్ రెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి అభినందనలు తెలిపారు.



ఎంఇఒను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



అంగన్వాడీ కార్యకర్తలకు 5జి ఫోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

సాంకేతిక పరంగా అభివృద్ధి కావాలి

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

కాలానికనుగుణంగా అంగన్వాడీలు సాంకేతికంగా అభివృద్ధి కావాలని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. బుధవారం ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ ఢిల్లీశ్వరి ఆధ్వర్యంలో అంగన్వాడీలకు సెల్ ఫోన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తల్లి, బిడ్డ సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని, వారికి అందుతున్న సేవలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. నియోజకవర్గంలో 229 మంది అంగన్వాడీలకు ప్రభుత్వం ఉచితంగా 5జి ఫోన్లు మంజూరు చేసిందని చెప్పారు. ఈ ప్రాంతంలో బాల్యవివాహాలు ఎక్కువగా చేస్తున్నారని, శారీరకంగా, మానసికంగా దృఢంగా లేని వయస్సులో పెళ్లి చేయడం వల్ల వారికి పుట్టే పిల్లలు బలహీనంగా, అనారోగ్యంగా పుడుతారని తెలిపారు. పిల్లల చదువు కోసం, పిల్లల ఆరోగ్యం కోసం వివిధ పథకాలను అందిస్తున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, వేతనాలు పెంచాలని సిడిపిఒ ఢిల్లీశ్వరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కోరారు. సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే పార్థసారథి హామీఇచ్చారు. కౌన్సిలర్లు ఎవి.సురేష్, చిన్న, నాయకులు కునిగిరి నీలకంఠ, నాగరాజు గౌడ్, ఉపేంద్ర, హుస్సేనప్ప యాదవ్, మధుసూదన శర్మ ఉన్నారు.

ప్రణాళికబద్ధంగా అభివృద్ధి

- మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని



భూమి పూజ చేస్తున్న ఛైర్మన్ లోకేశ్వరి

పట్టణంలో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, వైస్ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. బుధవారం నిజాముద్దీన్ కాలనీలో కౌన్సిలర్ ఫయాజ్ ఆధ్వర్యంలో డ్రెయినేజీ కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ఆదోనిలో నిజాముద్దీన్ కాలనీ ఏరియాలోని వెంకటేశ్వర కాలనీ, మైనార్టీ కాలనీలో రూ.10 లక్షలతో డ్రెయినేజీ కాలువ పనులు మొదలయ్యాయని తెలిపారు. జనరల్ ఫండ్ ద్వారా నిజాముద్దీన్ కాలనీలో రూ.16 లక్షలతో కాలువ పనులు త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం లేకుండా జరగడం సాధ్యం కాదన్న నిజాన్ని ఎమ్మెల్యే పార్థసారథి గమనించాలన్నారు. రూ.70 లక్షలతో పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపినా ఎమ్మెల్యే నిజాలను కప్పిపుచ్చి మాట్లాడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాలనీల్లో డ్రెయినేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు నాణ్యతతో.. నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కౌన్సిలర్లు బాలాజీ, రాజేశ్వర్ రెడ్డి, ముంబతి స్వామి పాల్గొన్నారు.

బెల్డోన సహకార సంఘం అభివృద్ధే లక్ష్యం

- ఛైర్మన్ కొండా రామాంజనేయులు

ప్రజాశక్తి - చిప్పగిరి

బెల్డోన సహకారం సంఘం అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తామని సహకార సంఘం ఛైర్మన్ కొండా రామాంజనేయులు తెలిపారు. బుధవారం చిప్పగిరిలో బెల్డోన సహకార సంఘం కార్యాలయంలో సహకార సంఘం ఛైర్మన్‌గా కొండా రామాంజనేయులు ప్రమాణ స్వీకారోత్సవం చేసిన తర్వాత టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, శివప్రసాద్ ఆదేశాల మేరకు నంచర్ల గ్రామానికి చెందిన వికలాంగుడు అంపయ్యకు ల్యాండ్ డెవలప్‌మెంట్ స్కీం కింద మంజూరైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో రుణాలు మంజూరు చేస్తామని, రైతులు కూడా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకారం సంఘం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు, టిడిపి కన్వీనర్ కొండా పురుషోత్తం, ఎబీసీ కాలువ డైరెక్టర్ మీసాల రామాంజనేయులు పాల్గొన్నారు.



వికలాంగునికి ల్యాండ్ డెవలప్‌మెంట్ స్కీమ్ చెక్కును అందజేస్తున్న రామాంజనేయులు, హరికృష్ణ

రైతు మేల్కొన్నాడు...

- మోసాల వ్యాపారి పారిపోయాడు..!
- ముందే చెప్పిన ప్రజాశక్తి

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పత్తి కొనుగోలు కోసం మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు పాగా వేశారు. ప్రభుత్వం సిసిఐ ద్వారా కొనుగోలు చేస్తున్న కేంద్రాలతో అలిసిపోయిన రైతులు మాయమాటలు చెప్పే వ్యాపారుల చేతుల్లో మోసపోతున్నారు. ఇటీవల మంత్రాలయం మండలం 52బసాపురం గ్రామంలో మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చిన పత్తి వ్యాపారులు తూకాల్లో చేస్తున్న మోసాలను గుర్తించి నిలదీశారు. ఒక క్వింటా పత్తి కాటా వేయగా 25 కిలోలు అధికంగా తూకంలో మోసం జరిగినట్లు రైతులు గుర్తించారు. పత్తిని కొనుగోలు చేసి తీసుకెళ్లడానికి తీసుకొచ్చిన లారీని అక్కడే వదిలి మహారాష్ట్రకు చెందిన వ్యాపారి పరారీ అయ్యారు. మంత్రాలయం నియోజకవర్గంలో కౌతాళం, కోసిగి, మంత్రాలయం, ఆదోని మండలంలోని కొన్ని గ్రామాల్లో గత 20 రోజుల నుంచి ఈ వ్యాపారులు పత్తిని కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలించారు. పత్తి వ్యాపారులపై ప్రజాశక్తి దినపత్రికలో 'మహారాష్ట్రకు తెల్ల బంగారం.. ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి' అనే శీర్షికన వార్తను ప్రచురించడం జరిగింది. తూకాల్లో జరిగే మోసాల గురించి ఎత్తి చూపడం జరిగింది. వార్త ప్రచురించినప్పుడు అధికారులు స్పందించి మహారాష్ట్ర వ్యాపారులకు అడ్డుకట్ట వేసి ఉంటే చాలామంది రైతులు మోస పోకుండా ఉండేవారు. ఇప్పటికైనా రైతులు మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు కూడా రైతులను మోసం చేసే వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, మోసాలు చేస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు.



బసాపురం గ్రామంలో వదిలి వెళ్లిన లారీ

ఎన్‌సిసి ద్వారా ఉద్యోగావకాశాలు

- కర్నూలు గ్రూపు కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి

ప్రజాశక్తి - ఆదోని

ఎన్‌సిసిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌సిసి కర్నూలు గ్రూపు కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి తెలిపారు. బుధవారం ఆదోనిలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్‌ను ఎన్‌సిసి అలోక్ త్రిపాఠి సందర్శించారు. ఎన్‌సిసి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మైదానంలో ఎన్‌సిసి విద్యార్థులతో గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ యువతలో ఉన్నత వ్యక్తిత్వం, క్రమశిక్షణ, నాయకత్వం, సాహసం, సేవా గుణాలను పెంపొందించాలనే ఉద్దేశంతో నేషనల్ కాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి)ను ఏర్పాటు చేశారన్నారు. ఎన్‌సిసి విద్యార్థులు దేశభక్తి, సేవా భావాన్ని కలిగి ఉండాలని తెలిపారు. ఎన్‌సిసి ద్వారా ఉన్నత విద్యా అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందన్నారు. అలాగే ఉద్యోగావకాశాల్లో ఉన్న రిజర్వేషన్‌ను ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎన్‌సిసి విద్యార్థులు ఆత్మనూన్యత భావాన్ని అధిగమించి సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని సూచించారు. గ్రూపు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కెప్టెన్ భీమన్య అరుణ్, లెఫ్టినెంట్ కల్నల్ శ్రీప్రియ, పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు జాన్ విక్టర్, రాజు, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ అనిల్ కుమార్, ఎన్‌సిసి కేర్ ఆఫీసర్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు గుర్రప్ప, పరిమళ, గురు ప్రసాద్, అమీన్ పాల్గొన్నారు.



ఎన్‌సిసి విద్యార్థులతో కమాండర్

జిల్లా సాధనే అంతిమ లక్ష్యం

- జిల్లా సాధన కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా ఆదోని అంతిమ లక్ష్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని జిల్లా సాధన కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ తెలిపారు. జిల్లా సాధనకు చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 32వ రోజుకు చేరాయి. 'మేము సైతం ఆదోని జిల్లా కోసం' అంటూ దూదేకుల సంఘం నాయకులు దీక్షకు కూర్చున్నారు. ఆదోని జిల్లా సాధన లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నాలు సిగ్గు చేటని, ఉద్యమం ప్రజల్లోకి వెళ్లిందని, డిమాండ్‌ను నెరవేర్చేందుకు పాలకులు దిగి రాక తప్పదని తెలిపారు. దూదేకుల సంఘం నాయకులు, సభ్యులు మాట్లాడుతూ... విద్యా రంగం అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా కావాల్సిందేనని స్పష్టం చేశారు. జిల్లా ఏర్పాటు ద్వారా విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదోని ప్రజల సమస్యలను గమనించి జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. ఆదోని జిల్లా సాధించే వరకు ఉద్యమం కొనసాగుతుందని నేతలు స్పష్టం చేశారు. నాయకులు ఖాసీం, కృష్ణమూర్తి గౌడ్, రఘురామయ్య, లలిత, వీరేష్ పాల్గొన్నారు.



దూదేకుల సంఘం నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రకాష్ జైన్

ఘనంగా సపోజ్ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని జెబి గార్డెన్స్‌లో బుధవారం రాత్రి సపోజ్ క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. క్రైస్తవ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో క్రీస్తును స్తుతిస్తూ మహిళలు గీతాలు ఆలపించారు. డాక్టర్ విజయ్ వాక్యోపదేశం చేశారు. క్రీస్తు పుట్టుక, ఆవశ్యకత గురించి వివరించారు.



గీతాలు ఆలపిస్తున్న మహిళలు



చికిత్స పొందుతున్న బాధితులు

టిడిపి సానుభూతి పరులంటూ ఇంటిపై దాడి

- గాయాలతో ఆస్పత్రిలో చికిత్స

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చిలకలడోన గ్రామంలో టిడిపి సానుభూతి పరులని భావించి తన కుటుంబపై దాడి చేశారని బాధితుడు భీమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన దేవేంద్ర, మహానంది, వెంకటేష్, శివలు మంగళవారం రాత్రి ఇంట్లోకి చొరబడి తనతో పాటు తన తల్లి నరసమ్మ, చెల్లెలు మంజులపై కుర్చీలతో దాడి చేసి గాయపరిచారని వాపోయారు. గ్రామంలో దేవేంద్ర రౌడీయిజం ఎక్కువయిందని, తాగి ఎవరిని పడితే వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. జరిగిన ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బుధవారం తెలిపారు. దేవేంద్ర నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. సిఐ రామాంజులును వివరణ కోరగా విచారణ చేపట్టినట్లు తెలిపారు.

జీవనజ్యోతి ఆశ్రమానికి పూర్వ విద్యార్థుల విరాళం

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (1993-94) పూర్వ విద్యార్థులు బుధవారం ఆదోనికి చెందిన జీవనజ్యోతి వృద్ధాశ్రమానికి విరాళం అందజేశారు. 15 ట్రంకు పెట్టెలు, రూ.15 వేల విలువ చేసే వంట సామగ్రి అందించారు. ప్రతేడాది తనకు తోచిన విధంగా తమవంతు సహాయంగా అందిస్తున్నామని అన్నారు.

రైతుసంఘం నాయకునికి మాతృవియోగం

ప్రజాశక్తి - హోళగుంద



లీలావతమ (ఫైల్)

రైతు సంఘం నాయకుడు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి తల్లి టి.లీలవతమ్మ (94) బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొంతకాలంగా ఆమె వృద్ధాప్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఆదోనిలోని వారి స్వగృహంలో మృతి చెందినట్లు తెలిపారు. వారి స్వగ్రామం సమ్మతగేరిలో గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు మెడికల్ కాలేజీ ముందు ధర్నా : సిపిఐ

ప్రజాశక్తి - ఆదోని

మెడికల్ కళాశాల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి వీరేష్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాల ముందు గురువారం ధర్నా ఉంటుందని, భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మాదన్న మృతి

- కడసారి వీడ్కోలు పలికిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - గోనెగండ్ల




మాదన్న (ఫైల్)

గంజిహళ్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పి.మాదన్న (55) అనారోగ్యంతో చికిత్స పొందుతూ కోలుకోలేక కర్నూలులోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో మంగళవారం రాత్రి మృతి చెందారు. గంజిహళ్లి గ్రామానికి చెందిన మాదన్న గత 30 ఏళ్ల క్రితం విద్యాశాఖలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా చేరారు. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులుగా దైవందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారు. జిల్లాలో సమకాలీన దళిత రచయితగా, దళిత బహుజన వాదిగా అందరికీ సుపరిచితుడు. బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్యలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏడాది క్రితం దళిత రచయితలు కదిరికోట ఆదెన్న, ఉపాధ్యాయులు ఆరెకంటి భాస్కర్‌తో కలిసి దళిత రచయితల సంఘం (దరసం)ను స్థాపించి ఆ సంఘానికి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. మాదన్న మరణాన్ని ఉపాధ్యాయులు, దళిత సాహిత్యవేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు జీర్ణించుకోలేక శోకసంద్రంలో మునిగిపోయారు. మాదన్న మరణం దళిత బహుజన వర్గాలకు తీరని లోటని పలువురు పేర్కొంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఎస్‌టియు రాష్ట్ర నాయకులు అడివన్న, యుటిఎఫ్ నాయకులు జి.బాబు, అబ్దుల్ సలీమ్, ఎపిటిఎఫ్ రహంతుల్లా, డిటిఎఫ్ జిల్లా నాయకులు గంగాధర్ నివాళులర్పించారు.

గంజహళ్లిలో ముగిసిన అంత్యక్రియలు

మాదన్న అంత్యక్రియలు బుధవారం గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామంలో నిర్వహించారు. వివిధ మండలాల నుంచి ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు కడసారి వీడ్కోలు పలికారు. **ఎమ్మిగనూరు** మండలం దైవందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మాదన్న అనారోగ్యంతో మృతి చెందారు. మాదన్న మరణం దళిత, బహుజన వర్గాలకు తీరని లోటని పలువురు పేర్కొన్నారు.



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆదోని : కవి మాదన్న మృతి సాహిత్య లోకానికి తీరని లోటని సాహితీ స్రవంతి ఆదోని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సక్కిరి భాస్కర్, స్వయం ప్రభ తెలిపారు. బుధవారం ఆదోనిలో నైస్ అకాడమీలో సంతాప సభ నిర్వహించి, కవి మాదన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'తెలుగు కవిత్వానికి కొత్త గొంతుక' అనే కవితా సంకలనాన్ని తీసుకొచ్చిన ఉపాధ్యాయ కవి మాదన్న మరణం సాహిత్య లోకానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. రచయితగా, దళిత బహుజన వాదిగా అందరికీ సుపరిచితులని తెలిపారు. ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంట్‌గా విధులు నిర్వహించేవారని చెప్పారు. గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామానికి చెందిన పి.మాదన్న అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి కర్నూలు నగరంలోని 'ఓమిని' ప్రయివేట్ హాస్పిటల్‌లో మృతి చెందారని తెలిపారు. మాదన్న గత 30 ఏళ్లుగా ఉపాధ్యాయులుగా సేవలందించారని చెప్పారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఉపాధ్యాయులు షేక్షావలీ, ఆవుల బసప్ప, గోపి, ఓంకార్, రామలక్ష్మి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మంచాలమ్మ దేవర

- కుంభాలతో నైవేద్య సమర్పణ

ప్రజాశక్తి - మంత్రాలయం

గ్రామ దేవత మంచాలమ్మ దేవరను పుర ప్రముఖుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం కమిటీ మాజీ సభ్యులు పూజారి వ్యాసరాజాచార్, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, మండల ఉపాధ్యక్షులు పులికుక్క రాఘవేంద్ర, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, నాయకులు అశోక్ రెడ్డి, ఎంపిటిసి మేకల వెంకటేష్, మంచాల సొసైటీ డైరెక్టర్ డిసి.తిమ్మప్ప, సిఐ రామాంజులు, ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో దేవర ప్రశాంతంగా సాగింది. మహిళలు కలశాలతో ముందు నడవగా మరికొందరు మహిళలు కుంభాలను మోసుకొని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయం చేరుకొని విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు స్వీకరించారు. గ్రామంలోని మారికాంబకు, సుంకలమ్మ, దేవమ్మకు కూడా నైవేద్యం సమర్పించారు.

ప్రముఖుల పూజలు : టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు వై.సీతారామిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నబసప్ప ధని, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, చిన్న సుంకప్ప, హండే అనుమంతు, వనికె నాగరాజు, బదిలీ ఎస్ఐ శివాంజల్, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, నాయకులు గోర్కల్ కృష్ణస్వామి, శివప్ప, కురువ మల్లికార్జున, జనార్దన్ రెడ్డి, శివ, రాఘవేంద్ర రెడ్డి, చెట్నిహళ్లి వైసిపి నాయకులు గంగుల వెంకటేష్, రచ్చుమర్రి గ్రామ నాయకులు బొజ్జప్ప పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న టిడిపి, వైసిపి నాయకులు



టిడిపిలోనే మైనార్టీలకు సముచిత స్థానం

- జిల్లా అధ్యక్షులుగా మైనార్టీలకు ఇవ్వడంపై హర్షం

ప్రజాశక్తి - దేవనకొండ



టిడిపి జిల్లా అధ్యక్షులు వహీద్ హుస్సేన్‌ను కలిసిన సుభాన్

టిడిపిలోనే ముస్లింలకు సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని టిడిపి మైనార్టీ మండల సీనియర్ నాయకుడు ఈదుల దేవరబండ సుభాన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడిపి అధిష్టానం జిల్లా టిడిపి అధ్యక్షులుగా మైనార్టీ వర్గానికి చెందిన వహీద్ హుస్సేన్‌కు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. బుధవారం టిడిపి అధ్యక్షుని కలిసి పూలమాల వేసి సన్మానించారు. దేవనకొండలో ముస్లిం, మైనార్టీ టిడిపి నాయకులు పి.సత్తార్ సాబ్, రాజా సాబ్, సుభాన్, చాంద్‌లు టిడిపి కార్యాలయం ముందు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

సిసి రోడ్డు, నూతన పైపులైన్‌కు నిధులు మంజూరు

- డిసిసి అధ్యక్షులు నగరడోన కిష్టప్ప

ప్రజాశక్తి - చిప్పగిరి

నగరడోనా మజరా గ్రామమైన తిమ్మాపురం గ్రామానికి రూ.5 లక్షలతో సిసి రోడ్డు, నూతన పైపులైన్ వేసేందుకు టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు అధికారులు మంజూరు చేశారని డిసిసి అధ్యక్షులు నగరడోన కిష్టప్ప తెలిపారు. బుధవారం తిమ్మాపురంలో శస్త్ర కాలేజ్ కరస్పాండెంట్ శేఖర్ ఆధ్వర్యంలో నగరడోన కిష్టప్ప గ్రామస్తులతో కలిసి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో సమస్య ఎక్కువగా ఉన్న వీధుల్లో సిసి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి ఆదేశాలు ఇచ్చారన్నారు. ఏ గ్రామంలో సమస్య ఉందో ఇన్‌ఛార్జీ దృష్టికి తీసుకెళ్లాలని టిడిపి నాయకులకు సూచించారు. బూత్ ఇన్‌ఛార్జీ మోహన్, నగరడోన ఈరన్న, లక్ష్మన్న, గోపాల్, హరి, వజ్రప్ప, సంజప్ప, పంపావతి పాల్గొన్నారు.



నగర డోన కిష్టప్పతో తిమ్మాపురం గ్రామస్తులు

ప్రజల మన్ననలు పొందాలి

- బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకి సిఐ సూచన

ప్రజాశక్తి - మంత్రాలయం



సిఐని కలిసిన ఎస్ఐ

ప్రభుత్వం అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సిఐ రామాంజులు ఎస్ఐ మల్లికార్జునకు సూచించారు. జిల్లాలో జరిగిన బదిలీల్లో భాగంగా మంత్రాలయం వచ్చిన మల్లికార్జున బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మల్లికార్జున సిఐని మర్యాదపూర్వకంగా కలిశారు. సిఐ మాట్లాడుతూ... గతంలో పోలీసు స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని, గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూస్తూ శాంతిభద్రతలను కాపాడాలని తెలిపారు. శ్రీరాఘవేంద్ర స్వామి దర్శనార్థమై వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలూ కలుగకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా గ్రామాల్లో ఇబ్బందులు కలిగిస్తున్న వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బదిలీ ఎస్ఐకి శ్రీమఠం సన్మానం

మంత్రాలయం ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ కర్నూలు సిసిఎస్‌కు బదిలీపై వెళ్తున్న ఎస్ఐ శివాంజల్‌ను శ్రీరాఘవేంద్రస్వామి మఠం మేనేజర్లు ఎస్.కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, సురేష్ కోనాపూర్, ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్ సన్మానించారు. బదిలీల్లో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పోలీసు స్టేషన్‌లో ట్రెయినీ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున బుధవారం మంత్రాలయం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు స్థానిక శ్రీమఠం పరిపాలన కార్యాలయంలో మల్లికార్జునకు శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐగా శ్రీరాఘవేంద్రస్వామి సన్నిధిలో విధులు నిర్వహించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని బదిలీ ఎస్ఐ శివాంజల్ తెలిపారు.



బదిలీ ఎస్ఐని సన్మానిస్తున్న శ్రీనివాసరావు

కత్తెర పురుగు పట్ల అప్రమత్తత అవసరం

- ఎడిఎ విజయమోహన్

ప్రజాశక్తి - దేవనకొండ

మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు పట్ల అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ ఎడిఎ విజయమోహన్, ఎఒ ఉషారాణి సూచించారు. బుధవారం మండలంలోని నెల్లిబండ గ్రామంలో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు తాకిడి ఎక్కువ ఉంటుందని, జీవ ఆధారిత నియంత్రణ ప్రారంభ దశలో నీమ ఆయిల్ లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల చొప్పున అజాడిరాక్టిన్ 0.15/0.3 పిచికారి చేసుకోవాలన్నారు. ఎమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్‌జి 0.4 గ్రా/లీటరు నీరు స్పైనెటోరామ్ 11.7 ఎస్సీ 0.5 మిల్లీలీటర్లు ఒక లీటరు పిచికారి చేసుకోవాలని తెలిపారు. మొక్క మధ్య భాగంలో మందు చేరేలా పిచికారి చేయాలన్నారు. సాయంత్రం వేళ పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. ఎఇఒ మల్లికార్జున, ఎంపిఇఒ రఫీ పాల్గొన్నారు.



'పొలం పిలుస్తుంది'లో పాల్గొన్న అధికారులు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రంగప్ప

ప్రజాశక్తి - నందవరం



నందవరం గ్రామానికి చెందిన రంగప్ప ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రంగప్ప ఎన్నికపై నందవరం గ్రామస్తులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన ప్రతినిధులు, పరిశీలకుల సమక్షంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రంగప్పను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. బుధవారం రంగప్ప మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యా విధానాలు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వాలు విధానాలు ఉన్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం విద్యను పూర్తిగా ప్రయివేట్‌కు అప్పగించే కుట్రగా ఉందని, దీనిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటిఐ, ఇంజినీరింగ్ కళాశాలల్లో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. విద్యార్థి హాస్టళ్లలో భోజన నాణ్యత దిగజారడం, తాగునీటి సమస్యలు, మరుగుదొడ్ల లేమీ వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు అంధకారం

ప్రజాశక్తి - నందవరం



అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

బాల్య వివాహాలతో అమ్మాయిల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని అంగన్వాడీ టీచర్స్ తెలిపారు. సూపర్‌వైజర్ గుణ శేఖరమ్మ ఆదేశాల మేరకు బుధవారం నందవరం కస్తూరిబా పాఠశాలలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాల్యవివాహాల వలన శారీరక, మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. విద్య అవకాశాలను కోల్పోతారని వివరించారు. అమ్మాయిల శారీరక ఎదుగుదల క్షీణించడం, ప్రసవ సమయంలో ఆరోగ్య సమస్యలు, రక్తహీనత, మాత, శిశు మరణాలు సంభవిస్తాయని తెలిపారు. జీవితంపై అవగాహన లేక సంసారంలో గొడవలు, విడాకులు తీసుకోవడం, ఆత్మహత్యలకు పాల్పడడం వంటి సంఘటనలు సంభవిస్తాయని చెప్పారు. అంగన్వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, సుంకులమ్మ, మేరమ్మ, లీలావతి, భాగ్యమ్మ పాల్గొన్నారు.